అమ్మ సన్నిధే.. పరమ పెన్నిధి

వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. పర్వదినాల సమయంలో అనేక ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు చేసి తరిస్తారు. ఈ నేపథ్యంలో దశాబ్దాలుగా బురుజుపేట వాసుల జీవితాలు అమ్మతోను, అమ్మ ఆలయ పరిసరాలతోను పెనవేసుకుపోయాయి. ఆలయ పరిసరాలు శుభ్రం చేస్తూ.. అమ్మకు పసుపు నీళ్లు పోస్తూ తరిస్తున్నారు. అలాగే అమ్మ ఆలయ సమీపంలో భక్తులకు పూజాద్రవ్యాలు విక్రయిస్తూ, దేవుడి పటాలు, ఇతర పూజా సామగ్రి అమ్మకాలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. అమ్మ దయే తమకు పదివేలు అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- కనకమహాలక్ష్మి అమ్మవారి సేవలో బురుజుపేటవాసులు
- మార్గశిర మాసమంతా సందడే సందడి
- తాత ముత్తాతల నుంచి చిరు వ్యాపారాలు చేసుకుంటూ అక్కడే జీవనం


పూజా సామగ్రి విక్రయాలు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసం వచ్చిందంటే చాలు బురుజుపేట.. కురుపాం మార్కెట్.. టౌన్ కొత్తరోడ్డు.. పప్పుల వీధి, చాత్రాజువారి వీధి, మట్టా వెంకటప్ప వీధి, సీతారామాలయం ఏరియా తదితర ప్రాంత వాసులకు నెల రోజుల పాటు సందడే సందడి. అందులోనూ మార్గశిర మాసంలోని గురువారాలైతే ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న ఇంటింటికీ సంబరమే. ఈ ప్రాంతంలో ఉన్న వారంతా ఉదయాన్నే నిద్ర లేచి కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తారు. ఈ నెల రోజుల పండగతో ఆ ప్రాంతమంతా సందడిగా ఉంటుంది. పండగలనేవి ఒకటి రెండు రోజులు ఉంటాయి. సంక్రాంతి పండగ కూడా మూడు రోజులే జరుపుకుంటారు. మార్గశిర మాసంలో మాత్రం ఈ ప్రాంత ప్రజలకు నెల రోజులూ పండగే. మార్గశిర మాసోత్సవాల ప్రతి బుధవారం అర్ధరాత్రి 12.05 గంటల నుంచి నిర్వహించే అమ్మవారి ప్రత్యేక పూజకు స్థానికులే పసుపు నీళ్లు పోయడం ఆనవాయితీగా వస్తోంది. పసుపు నీళ్లు పోసేందుకు స్థానిక మహిళలు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు. అమ్మవారి సేవలో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తుంటాయి. అలాగే ఏడు దశాబ్దాల పైబడి ఇక్కడే కొబ్బరికాయలు విక్రయిస్తూ అమ్మ సేవలో ఉన్న వారు ఎందరో.


దేవుడి బొమ్మలు.. తదితర సామగ్రి విక్రయిస్తూ


ఆలయ ప్రధాన ద్వారం


ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఓ స్వచ్ఛంద సంస్థ

మార్గశిర మాస పూజలకు భక్తుల తాకిడి..

కనకమహాలక్ష్మి అమ్మవారిని మార్గశిర మాసంలో దర్శించుకునేందుకు భక్తులు వెల్లువెత్తుతారు. నగరం నుంచే కాకుండా పలు ప్రాంతాల నుండి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి అమ్మను పూజిస్తారు. మార్గశిర మాసం అంతా కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ పరిసరాలు జాతరను తలపిస్తాయి.

తాత ముత్తాతల నుంచి..



తాతముత్తాతల నుంచి అమ్మ సన్నిధిలోనే కొబ్బరికాయలు విక్రయిస్తున్నాం. మా తాత.. తండ్రి ఇక్కడే కొబ్బరికాయలు విక్రయించారు. అనంతరం నేను కూడా కొబ్బరికాయలు విక్రయిస్తూ అమ్మ సేవలోనే ఉంటున్నాను. కనకమహాలక్ష్మినే నమ్ముకున్నాం. ఆ రోజుల్లో రూ.2కే కొబ్బరికాయ.. రూ.1కే పాలప్యాకెట్, మొత్తం సెట్ రూ.5కే విక్రయించేవారం. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఇక్కడే బతుకుతున్నాం. **– రాజు, కొబ్బరికాయల వ్యాపారి**

నాలుగు తరాలుగా..



నాలుగు తరాలుగా అమ్మ ఆలయం వద్దే కొబ్బరికాయలు విక్రయిస్తున్నాం. ప్రారంభంలో అమ్మ ఆలయానికి ఆనుకుని విక్రయించేవారం. ఆలయం అభివృద్ధి చెందుతుండడంతో అక్కడి నుంచి ఇక్కడికి వచ్చాం. మార్గశిర మాసంలో క్యూలైన్లు అధికంగా ఉండడంతో కొబ్బరికాయలు కొనుగోలు చేసేవారు క్యూలైన్లు ప్రారంభం నుంచే.. అంటే టౌన్‌కొత్తరోడ్డు వద్దే కొనుగోలు చేసి వస్తుంటారు. ఏడాది పొడవునా విక్రయిస్తుంటాం. **– నాగమణి, కొబ్బరికాయల వ్యాపారి**

క్లుప్తంగా

అవయవ దాతల సంఘం అధ్యక్షుడిగా అప్పలనాయుడు


అప్పలనాయుడుకు నియామక పత్రం అందజేస్తున్న సీతా మహాలక్ష్మి

మహారాణిపేట: అవయవ దాతల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా మెరుగు అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మంగళవారం అఖిల భారత సంఘం వ్యవస్థాపకురాలు గూడురు సీతామహాలక్ష్మి అప్పలనాయుడుకు అందజేశారు. అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన ఎం. అప్పలనాయుడు ఉన్నత విద్యావంతుడే కాకుండా సమాజ సేవా తత్పరుడిగా పేరు తెచ్చుకున్నారు. అతను మాజీ ఎంపీటీసీ మెంబర్ కూడా. గత జూలైలో ఆయన అన్నయ్య కూతురు అడవివరంలో ప్రమాదానికి గురి అయింది. కిమ్స్ ఆస్పత్రిలో వైద్యం అందించినా ఆమె కోలుకోలేదు. బ్రెయిన్ డెడ్ అయింది. అవయవ దాన ఉద్యమం పట్ల అవగాహన కలిగిన అప్పలనాయుడు కుటుంబ సభ్యులను, గ్రామ ప్రజలను ఒప్పించి ఆమె అవయవాలను దానం చేయించారు. ఆయనను గూడూరు సీతామహాలక్ష్మి అభినందించారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి రైల్వేస్టేషన్ ఆవరణలో తనిఖీలు నిర్వహించగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద ఉన్న బ్యాగును సోదా చేయగా గంజాయి ఉన్నట్లు గుర్తించి ఫోర్తుటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారించగా గుంటూరుకు చెందిన ఎస్.కె. ఇసుబ్ (21)గా అతన్ని గుర్తించారు. అతని వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.విజయకుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ జి.వెంకటరావు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సీతమ్మధార: స్థానిక వుడా కాంప్లెక్స్ సమీపంలోని మద్యం దుకాణం వద్ద ఒక వ్యక్తి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రాంతానికి చెందిన చీపురుపల్లి పూర్ణ (42) కొబ్బరి బొండాలు విక్రయిస్తుంటాడు. వివాహమైనా మనస్పర్థల కారణంగా కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఈ వ్యక్తికి మద్యం సేవించే అలవాటు ఉంది. ఎప్పటిలాగే మంగళవారం 11.30 గంటల సమయంలో సీతమ్మధార వుడా కాంప్లెక్స్ వద్ద మద్యం దుకాణంలో మద్యం తీసుకున్నాడు. అక్కడ గోడకు ఆనుకుని మద్యం సేవించి కదలకుండా ఉండిపోవడంతో చుట్టుపక్కల వాళ్లు ద్వారకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైబ్రరీ అభివృద్ధికి సహకారం

సీతంపేట: ద్వారకానగర్‌లో గల విశాఖ పౌరగ్రంథాలయాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. పోటీ పరీక్షల విద్యార్థులు చదువుకోవడానికి గ్రంథాలయంలో కల్పించిన సౌకర్యాలను, వివిధ విభాగాలను తిలకించారు. కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. దేనికి ప్రిపేర్ అవుతున్నారు, ఎక్కడి నుంచి వస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవడానికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి, లైబ్రరీ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్. వర్మ, టి.ఎస్.ఆర్.ప్రసాద్, జనసేన నాయకులు రాజు, చంటి, శివప్రసాద్, రాజేష్, నారా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి


లక్ష్మీహోమం పాల్గొన్న ఈవో శోభారాణి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 పూజా రుసుం చెల్లించి దంపతులు పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విశేష హోమాలు..

మార్గశిర మాసోత్సవాల రెండో రోజు మంగళవారం శ్రీచక్రనవవర్ణార్చన, లక్ష్మీహోమం, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహావిద్యా పారాయణ, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ఈవో కె. శోభారాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్గశిర మాసోత్సవాల సందర్భంగా మంగళవారం టౌన్‌కొత్తరోడ్డు వద్ద వెలసిన జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో వెయ్యి మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల బార్జిలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ పూర్తి కావడంతో ఫౌండేషన్ అధినేత దుంగి చంద్రగిరిరెడ్డి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. రెండు నెలల క్రితం పేద మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభించారు. ఐదుగురు మహిళల వంతున రోజుకి రెండు బ్యాచ్‌ల కింద శిక్షణ ఇస్తున్నామని చంద్రగిరిరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక బ్యాచ్‌కి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మరొక బ్యాచ్‌కి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ అనంతరం మహిళలకు సర్టిఫికెట్లు, ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశామన్నారు. సేవా కార్యక్రమాలలో భాగంగా పేద మహిళలకు పది కుట్టు మిషన్లు అందజేశామని పేర్కొన్నారు. సబ్బవరంలో ఈ సంస్థ ద్వారా పాఠశాల విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశామని, ఎంపిక చేసిన ముగ్గురు విద్యార్థులకు నేత్ర శస్త్ర చికిత్సలు చేశామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్జి కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కుట్టుమిషన్లు అందుకుంటున్న మహిళలు

పేగుబంధం



చనిపోయిన పిల్ల కుక్కను చూసి తల్లి స్పందించిన తీరు కంటతడి పెట్టిస్తోంది. కురుపాం మార్కెట్ సమీపాన టౌన్‌హాల్ రోడ్డులో రోడ్డు ప్రమాదంలో ఓ పిల్ల కుక్క చనిపోయింది. అది చూసిన తల్లి.. పిల్ల కుక్క మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు అక్కడికక్కడే తిరుగుతూ.. పిల్ల కుక్క రక్తాన్ని వాసన పీలుస్తూ ఉండటం హృదయాల్ని కలచివేస్తోంది. నడిరోడ్డుపై ప్రమాదవశాత్తు చావు బతుకుల మధ్య ఉన్న ఆ కుక్క పిల్లను బతికించే ప్రయత్నంలో స్థానికులు నోటిలో నీళ్లు పోసారు. నిర్జీవంగా పడి ఉన్న బిడ్డ వద్దనే తల్లి కుక్క అరుస్తూ.. ఆ పిల్ల కుక్కను చూసి స్పందించిన తీరు కంటతడి పెట్టిస్తోంది. - దాబాగార్డెన్స్

ఎబిలిటీ పీపుల్స్ సంస్థ సేవలు నిరుపమానం

దాబాగార్డెన్స్: దివ్యాంగులకు ఎంతో ఉపయోగకరంగా ఎబిలిటీ పీపుల్స్ సంస్థ ఉందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు.అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నియోజకవర్గ పరిధి 31వ వార్డు ద్వారాబజార్ వద్ద గల ది ఎబిలిటీ పీపుల్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. వికలాంగులకు కల్పించే సదుపాయాలపై సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ దిలీప్ పాత్రోని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన, వెన్నుపూస గాయపడిన వారికి పునరావాస కేంద్రంగా ఉపయోగపడుతుందని, అలాగే 0 నుంచి 8 ఏళ్ల వికలాంగులకు వైద్య సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇక నుంచి తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి ఫిజియోథెరపీతో పాటు వైద్య సదుపాయం ఉచితంగా కల్పించనున్నట్టు సంస్థ ప్రతినిధి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా 22 మంది పిల్లలకు కృత్రిమ అవయవాలు, వీల్‌చైర్లు అందజేశారు. తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే వంశీ తెలిపారు.


చిన్నారులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఓపెన్ జిమ్ పరిసరాలు పరిశుభ్రం

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో గల బాబూకాలనీ, సెబాస్టియన్ కాలనీ ప్రాంతాల్లో గల ఓపెన్ జిమ్‌లను శుభ్ర పరిచారు. జ్ఞానాపురం ప్రాంత ప్రజలు వ్యాయామం చేసేందుకు పేదోడి ఓపెన్ జిమ్ములను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. ప్రజల ఆరోగ్య రక్షణ పట్ల ఎంతో బాధ్యతగా ఏర్పాటు చేసిన జిమ్‌లు కూటమి ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురవుతుండడంతో ఈ నెల 3న 'సాక్షి'దినపత్రిక 'నిరుపయోగంగా ఓపెన్ జిమ్‌లు'అనే కథనం ప్రచురించింది. దీంతో సంబంధిత జోనల్ ఇన్‌చార్జి కమిషనర్ తారా ప్రసన్నరెడ్డి ఆదేశాల మేరకు పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునీల్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు ఓపెన్ జిమ్ పరిసరాలు పరిశుభ్ర పరిచారు. దీంతో స్థానికులు, వాకర్లు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సంబంధిత అధికారులకు ఓపెన్ జిమ్‌కు రక్షణ గోడ నిర్మించాలని వినతిపత్రం అందించారు.


శుభ్రపడిన ఓపెన్ జిమ్ పరిసరాలు

అప్పన్న అన్నప్రసాదానికి విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన ఎం.నరసింహకుమార్ లక్షా 11 వేల 116 రూపాయల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ వి.సూర్యనారాయణకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు


తాటిచెట్లపాలెం కూడలిలో నెలల తరబడి నిలిపిన భారీ వాహనాలు

- మూలకు చేరి తుప్పపట్టిన వాహనాలు
- చీకటి పడితే మందుబాబుల ఆగడాలు
- జాతీయ రహదారి సబ్‌వేల్లోనూ అదే పరిస్థితి
- అధికారులు స్పందించాలని స్థానికుల మొర

కంచరపాలెం: జీవీఎంసీ 54, 55 వార్డుల పరిధిలో భారీ వాహనాలు, కార్లు, ఆటోల అక్రమ పార్కింగ్‌తో వాహన చోదకులు, స్థానికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన, అంతర్గ రహదారులపై భారీ లారీలు, ట్రావెల్స్ బస్సులు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు. తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెం, అలాగే కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి జ్ఞానాపురం వెళ్లే మార్గాలు, ఊర్వశి కూడలి నుంచి కంచరపాలెం మీదుగా తాటిచెట్లపాలెం వెళ్లే జాతీయ రహదారి సబ్‌వేల్లో నెలల తరబడి వాహనాలు నిలిపి ఉంచేయడంతో వాహన చోదకులు, పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. రెండేసి వరుసల్లో వాహనాలు నిలిపి మరమ్మతులు చేపట్టడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జాతీయ రహదారిలోని గ్రీన్‌బెల్ట్‌కు ఆనుకుని ఉన్న సబ్‌వేల్లో ఎన్నో నెలలుగా తుప్పుపట్టి మూలకు చేరిన కార్లు, ఇతర వాహనాలు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో చెత్తా చెదారం, మట్టి గుట్టలుగా పేరుకుపోతోంది. ఇరుకు రోడ్లపై వాహనాలు నిలిపేస్తున్న కారణంగా కొన్నిసార్లు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రోడ్ల పక్కన నిలిపి ఉంచిన వాహనాల్లో ఆకతాయిలు మత్తు పదార్థాలు సేవించి అటుగా వెళ్లే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జోన్-5 టౌన్ ప్లానింగ్ అధికారులకు, సచివాలయ కార్యదర్శులకు స్పెషల్ డ్రైవ్‌లు పెట్టి వినియోగం లేని, తుప్పుపట్టిన వాహనాలను తరలించాలని స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కంచరపాలెం ఫ్లైఓవర్ మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలు ఎక్కడ పడితే అక్కడ నిలుపుతుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలకు అడ్డు లేకుండా పోతుంది. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు చెబుతున్నారు.


కంచరపాలెంలోని గ్రీన్‌బెల్ట్‌లో నిలిపిన వాహనాలు

ఇప్పటికైనా సంబంధిత ట్రాఫిక్ పోలీస్ అధికారులు, జోన్-5 టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి నెలల తరబడి నిలిపిన వాహనాలను తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని వాహన చోదకులు, పాదచారులు కోరుతున్నారు.


జాతీయ రహదారిలో తుప్పపట్టి మూలకు చేరిన వాహనం

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ


విద్యార్థులతో విశాఖ కంటి ఆస్పత్రి ప్రతినిధులు

సీతమ్మధార: విశాఖ కంటి ఆస్పత్రి, విబార్ట్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మొహిసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ నేతృత్వంలో విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. పి అండ్ టి కాలనీలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (జీవీఎంసీ)లో గత నెలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో లోపం గుర్తించి కంటి అద్దాలు అవసరం అయిన 39 మందికి ట్రస్ట్ ప్రతినిధులు చందు, రాజు మంగళవారం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. పాఠశాల తరఫున హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధం


నిరసన చేపడుతున్న సెవెన్ హిల్స్ కార్మికులు

సీతంపేట: కార్మిక చట్టాలను ఉల్లంఘించి 38 మంది ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రి కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడం చట్ట విరుద్ధమని బాధితులు మండిపడ్డారు. తమకు న్యాయం చెయ్యాలని కోరుతూ అక్కయ్యపాలెంలో గల లేబర్ ఆఫీస్ ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.రాజు మాట్లాడుతూ యాజమాన్యం అవసరానికి మించి కార్మికులు ఉన్నారని చెబుతూనే కొత్తగా 20 మందిని భర్తీ చెయ్యడం, 38 మంది పాత కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. నిబంధనలు పాటిస్తున్నామని చెబుతూ సీనియర్లను తొలగించి కొత్తవారిని పనిలో చేర్చుకున్నారని ఆరోపించారు. కాంట్రాక్టు పద్ధతిపై కార్మికులను పనిలో పెట్టుకుని వెట్టి చాకిరీ చేయించుకుని దోపిడీ చెయ్యాలనే ఉద్దేశంతో యాజమాన్యం చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. కార్మిక శాఖ అధికారులు ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

పేదలకు పండ్లు, ఆహార ప్యాకెట్ల పంపిణీ

ఎంవీపీకాలనీ: విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు పండ్లు, ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రతినిధులు బోని శివరామకృష్ణ, దేవరకొండ మార్కెండేయులు తదితరులు ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, బీచ్‌రోడ్డు, సిరిపురంతో పాటు పలు ప్రాంతాల్లో పేదలకు, భిక్షాటన చేసే వారికి ఈ ఆహార పదార్థాలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజ స్థితిగతులపై అవగాహన అవసరం

మురళీనగర్: విద్యార్థులు సామాజిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఇంజినీరింగ్ విద్య, నైపుణ్య సలహాదారుడు డాక్టర్ నాగిరెడ్డి కొవ్వూరు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సివిల్ ఇంజినీరింగు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు పర్యవేక్షణలో సివిల్ ఇంజినీరింగు హెడ్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నీ గురించి నీవు తెలుసుకో అనే అంశంపై ఆయన ప్రసంగించారు. విద్యార్థులే భవిష్యత్తు నిర్దేశకులని, సమాజంలో జరుగుతున్న మార్పులతో పాటు సామాజిక బాధ్యతను తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు. సబ్జెక్టుపై పట్టు సాధించడంతో పాటు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. విద్యార్థులు తమ గురించి తాము తెలుసుకోవాలన్నారు. తమలో ఉన్న బలాన్ని తెలుసుకుని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. తల్లిదండ్రుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు. మన ఆలోచనలు, విజ్ఞానం, దేశ ప్రగతికి దోహదపడే విధంగా ఉండాలని, తమ నడవడి ఇతరులకు ఆదర్శంగా ఉండాలన్నారు. పది మందితో కలిసి చర్చించడం, వేదికలపై నిలబడి నిర్భయంగా మాట్లాడటం అలవాటు చేసుకోవాలన్నారు. సమస్యలకు వెరవకుండా ఎదుర్కొనే ధైర్యం కలిగిన వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.